క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సాయి భిక్షాటన



నగర వీధుల్లో భిక్షాటన చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: స్థానిక మూడవ రోడ్డు పరిసర ప్రాంతాలు సాయి నామస్మరణతో మార్మోగాయి. గురుపౌర్ణమి పర్వదినాల సందర్భంగా ఆదివారం స్థానిక మూడవ రోడ్డులోని షిర్డీ సాయిబాబా మందిరం నిర్వాహకులు భక్తులతో కలిసి సాయి చిత్రపటంతో భిక్షాటన చేశారు. ఇంటింటికీ వెళ్లి ఆగస్ట్ 21న జరుగనున్న గురుపౌర్ణమి అన్నప్రసాద వితరణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. 19 నుంచి మూడు రోజుల పాటూ వరుసగా మందిరంలో సాయిసచ్చరిత్ర పారాయణం, సామూహిక సాయి సత్యదేవుని వ్రతాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. అంతకు ముందు సాయి నాథుడికి అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో మందిరం కార్యనిర్వాహక సభ్యులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

'రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్‌దే'

అనంతపురం కార్పొరేషన్: ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి తమ జీవితాల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ వెలుగులు నింపారని మేయర్ వసీం పేర్కొన్నారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రిజర్వేషన్ ద్వారా పెద్ద సంఖ్యలో మైనార్టీల పిల్లలు ఉన్నత చదువులు చదివి వైద్యులు, ఇంజినీర్లు, తదితర అధికారులుగా ఎదిగారన్నారు. ఈ రోజు మైనార్టీలు ఆ స్థాయిలో ఉన్నారంటే ఆనాడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తీసుకున్న గొప్ప నిర్ణయమే అన్నారు. ముస్లిం మైనార్టీలు వైఎస్సార్ కుటుంబానికి రుణపడి ఉంటారన్నారు.

150 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అనంతపురం కల్చరల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించడం ఆనందకరమని లయన్ అసిఫుద్దీన్ అన్నారు. స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీసు పాఠశాల ప్రాంగణం వేదిక సాగిన శిబిరంలో వివిధ ప్రాంతాల నుండి 250 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. మరో 150 మందికి ఉచిత ఆపరేషన్లకు రెఫర్ చేసినట్లు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. కంటి సమస్యలతో బాధ పడేవారు ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వారికి భోజన వసతి కల్పించారు. దుప్పట్లు అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నబీరసూల్, ఉమామహేశ్వరి, పాలగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పూర్తి



కల్వర్టులో పూడికను తొలగించిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పాతూరు చెన్నకేశవస్వామి దేవాలయం సమీపంలోని కల్వర్టు పూడికతీత పనులు పూర్తయ్యాయి. కొన్ని రోజులుగా కల్వర్టు బ్లాక్ అయిన విషయం విదితమే. మేయర్ వసీం, తదితరులు ప్రత్యేక చొరవ తీసుకుని పూడికతీత పనులు చేపట్టేలా ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తిని ఆదేశించారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఆ ప్రాంతంలో పూడికతీత పనులు చేపట్టారు. ఆదివారం రోజున ఆ పనులు పూర్తయ్యాయి.

క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలి



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

అనంతపురం: ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో జిల్లా స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీలను జిల్లా తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.గురుస్వామి ప్రారంభించి, మాట్లాడారు. క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. జాతీయ స్థాయిలో పేరు తీసుకురావాలని కోరారు. కాగా ఈ పోటీల్లో 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి కే.శాంత రాజ్, తైక్వాండో కోచ్‌లు కేశవ్, వెంకట్, రాజేష్, మణీంద్ర, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న మహిళలు



డ్రమ్స్ వాయిస్తున్న దృశ్యం



ర్యాలీగా వస్తున్న జైన మహిళలు

ఆకట్టుకున్న జైనుల శోభాయాత్ర



జెండాలతో చిన్నారుల సందడి



కలశం ఎత్తుకున్న బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి



రంగుల టపాసులు కాల్చుతున్న యువత

దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూ 41 రోజుల పాటూ నగరంలో దీక్షలు చేయడానికి వచ్చిన జైన్ స్వామీజీల రాకతో స్థానిక కమలా నగర్ జైన్ మందిర పరిసరాల్లో సందడి నెలకొంది. ఆదివారం టవర్‌క్లాక్ నుంచి కొత్తూరు జైన మందిరం వరకు జైనులు భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. వాసుపూజ్య జైన్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన నగరోత్సవంలో వందలాది మంది మహిళలు, పిల్లలు సంప్రదాయ జైన్ భక్తిగీతాలను ఆలపించారు. స్వయంగా డ్రమ్స్ వాయిస్తూ హోరెత్తించారు. నాట్యంతో సందడి చేశారు. జైన్ సంఘం ప్రతినిధులతో పాటూ బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి స్వయంగా కలశాన్ని తలపై పెట్టుకుని ఊరేగింపుగా మందిరం వద్దకు చేరుకున్నారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన స్వామీజీలు ఎస్.ప్రభాశ్రీజీ, రోషన్ ప్రభాజీ అనుగ్రహ భాషణం చేశారు. చాతుర్మాస వ్రతాల ప్రాముఖ్యత, భక్తిమార్గం, అన్నదాన విశిష్టత తదితర అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సురేష్ కుమార్ కొఠారి, అశోక్ కుమార్, దేవీచంద్, ప్రకాష్ జైన్, సోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

– అనంతపురం కల్చరల్:

తెలుగుదనం ఉట్టిపడేలా ఆంగ్ల కథలు

అనంతపురం కల్చరల్: అనంతవాసి గోళ్లపల్లి శంకర నారాయణ రాసిన ఆంగ్ల కథల్లోనూ తెలుగుదనం ఉట్టిపడుతోందని ఆకాశవాణి ఉన్నతశ్రేణి వ్యాఖ్యాత, కవి డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక తపోవనంలోని వేదమాత గాయత్రి ఆలయంలో ఇంగ్లిష్, తెలుగు ద్విభాషా రచయిత గోళ్లపల్లి శంకరనారాయణ కథా సంకలనం చేసిన ×ది ఫెయిరీ ఇన్ ద జంగిల్€ పుస్తకావిష్కరణ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రముఖ హోమియో వైద్యుడు యాదాటి రామగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి, ఆచార్య మాడ్గుల ప్రఫుల్ల, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్ నారాయణ,డాక్టర్ గొల్లాపిన్ని సీతారాం ప్రసంగించారు. పుస్తకం ఆద్యంతం సులభమైన భాషలో చదివించేదిగా ఉందన్నారు. ముఖ్యంగా ఆంగ్లంలో కథలు రాసే ఔత్సాహికులకు చక్కటి మార్గదర్శిగా ఉందని తెలిపారు. మిత్రలాభం, మిత్రబేధం నుంచి ప్రేరణ పొందాయా అన్నట్లున్న కథల్లో మానవ సంబంధాలు హృద్యంగా సాగిపోయాయని కొనియాడారు. అంతకు ముందు రచయిత తమ గురువైన పూర్వ విద్యాశాఖాధికారి కేఎస్ విద్యాసాగర్‌కు పుస్తకాన్ని అంకితమిచ్చారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, రచయిత సన్మానం జరిగాయి. కార్యక్రమంలో సాహితీవేత్తలు లక్ష్మీకాంతం, ఆలయ నిర్వాహకులు శైలేంద్ర, రొద్దం అనంత్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

స్పందించారు.. సమస్యను పరిష్కరించారు



జేసీబీతో మట్టి తొలగింపు పనులు చేయిస్తున్న ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి



రోడ్డుపై చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: ఇటీవల కురిసిన వర్షాలకు ఆత్మకూరు మేజర్ పంచాయతీలోని ప్రధాన రహదారిపై భారీగా మట్టి చేరింది. వాహనాలు వెళ్తే పెద్ద ఎత్తున దుమ్ములేస్తోందని.. అంతేకాకుండా వెనుక నుంచి వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఈనెల 3వ తేదీన సాక్షి దినపత్రికలో 'పట్టించుకోకపోతే ప్రమాదమే' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, పంచాయతీ సిబ్బంది, అధికారులు ఆదివారం మట్టి తొలగింపు పనులు చేపట్టారు. జేసీబీతో రోడ్డుపై అడుగుకు పైగా ఎత్తులో పేరుకుపోయిన మట్టిని తొలగించి ట్రాక్టర్లలో తరలించారు. సమస్యను పరిష్కరించడంతో పంచాయతీ సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

అనంతపురం రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి అన్నారు. ఆదివారం నగరంలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వసతి గృహంలోని గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా డీడీ కుష్బూ కొఠారి మాట్లాడుతూ.. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. ప్రతి వసతి గృహంలో పచ్చని వాతావరణం నెలకొల్పాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. విద్యార్థులు, సిబ్బంది విధిగా మొక్కలను సంరక్షించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఓబులమ్మ, సహాయ సంక్షేమ అధికారి సుభాషిణి, హెచ్‌డబ్ల్యూఓల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మస్తాన్, వార్డెన్లు మారుతి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న డీడీ కుష్బూ కొఠారి

నబీరసూల్ జీవితం ఆదర్శప్రాయం

అనంతపురం కల్చరల్: అనంత సాహిత్యంలో తనదైన శైలిలో రచనలు చేస్తున్న నబీరసూల్ జీవితం ఆదర్శప్రాయమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి అన్నారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సీనియర్ కవి కంబదూరు షేక్ నబీరసూల్ రచించిన నిత్యనవనీతం–నబీరసూల్ సుభాషితం పుస్తకావిష్కరణ జరిగింది. ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి, త్యాగరాజ సంగీత సభ అధ్యక్షుడు సంపత్‌కుమార్, ఆచార్య సుధాకర బాబు, లయన్స్‌క్లబ్ విరూపాక్షరెడ్డి, పుస్తక సమీక్షకురాలు పేరిందేవి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేవలం సాహిత్య రంగంతో తృప్తి పడకుండా అనేక రంగాల్లో విశేష సేవలందిస్తున్న నబీరసూల్ యువతరానికి స్ఫూర్తినందిస్తున్నారన్నారు. నైతిక విలువలను ప్రబోధించే ఇటువంటి పుస్తకాలు ఈ తరానికి ఎంతో అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. పేదరాశి పెద్దమ్మ కథల్లా ఎందరికో జీవిత పాఠాలను పుస్తకం నేర్పుతుందన్నారు. గోసల నారాయణ స్వామి ఉద్దీపన గీతం ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం నబీరసూల్‌ను కవులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ రచయిత తరిమెల అమరనాథ రెడ్డి, ఫర్ ది సొసైటీ అధ్యక్షుడు పోతుల రాధాకృష్ణ, జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, కవులు వన్నప్ప, మధురశ్రీ, మిద్దె మురళీకృష్ణ, రియాజుద్దీన్, షరీఫ్, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, నాగలింగయ్య, అంకె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నవనీతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

వికలాంగుల చట్టాలను అమలు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: వికలాంగుల చట్టాలను అమలు చేసి న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి కోరారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. శారీరక వికలాంగులే తప్ప మానసిక వికలాంగులు కాదన్నారు. ప్రభుత్వం ఒకేసారి వికలాంగులకు రూ.6,000 పెన్షన్ ఇవ్వాడం సంతోషకరమన్నారు. వీరిలో అనర్హులు ఉన్నారని తొలగించకుండా పింఛన్ ఇవ్వాలన్నారు. అలాగే ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పుల్లప్ప, జానకీరామ్, చంద్రాయుడు, నారాయణ, మద్దిలేటి, నాగన్న, జయమ్మ, ముత్యాలమ్మ, రామక్క, చంద్రకళ, రామకృష్ణ, చిన్న, వివేక్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం రూరల్: ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం కురుగుంట పంచాయతీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా మలరాయుడు, కోశాధికారిగా శంకర్, కన్వీనర్‌గా లక్ష్మన్న, కార్యనిర్వాహక సభ్యులుగా గంగాధర్, లక్ష్మన్న, ఈశ్వరయ్య, జూటూరు ఓబులపతిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దళితుల అభివృద్ధి కోసం పాటుపడుతామన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదినారాయణ, మానుకింద ముత్యాలు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, సురేష్, అశోక్, శంకర్, దామాజిపల్లి, న్యామద్దెల గ్రామాల సభ్యులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

మొహర్రం వేడుకలకు అంకురార్పణ





గుద్దిలి వేసి మొహర్రం వేడుకలు ప్రారంభిస్తున్న దృశ్యం, ఆత్మకూరులోని సర్దార్‌వలి దర్గా

ఆత్మకూరు: కుల మతాలకు అతీతంగా కలసి, మెలసి జరుపుకునే మొహర్రం వేడుకలు ఆత్మకూరులో ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి మండల కేంద్రంలో ఉన్న పీర్ల చావిడి వద్ద గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గుండం దగ్గర చదివింపులు చేశారు. గుద్దిలి వేసి మొహర్రం వేడుకలకు అంకురార్పణ చేశారు. 10వ తేదీన పెట్టి మెరువణి చేసి ఆ రోజు రాత్రికి పీర్లను చావిడిలో కొలువుదీర్చుతారు. 12వ తేదీన పీర్ల స్వాములకు వెండి ఆభరణాల అలంకరణ, 13వ తేదీన అగ్నిగుండము ఏర్పాటు చేస్తారు. 14వ తేదీన ఏడవ, చిన్న సరిగెత్తు నిర్వహిస్తారు. అనంతరం అదే రోజు సాయంత్రం వన్నూర్‌స్వామి పీరుకు గ్రామోత్సవం చేస్తారు. 15వ తేదీన విడిదినం, 16వ తేదీన పెద్ద సరిగెత్తు నిర్వహిస్తారు. 17వ తేదీన ఉదయం తెల్లవారుజామున దేవుళ్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం జలధికి పోవుట, 19వ తేదీన స్వామి చివరి దర్శనంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయి.

భక్తుల కొంగుబంగారం సర్దార్ వలి..

ఆత్మకూరులో ఉన్న సర్దార్ వలి దర్గాలో హిందూ ముసిల సోదరులు అందరూ కలసి మెలసి స్వామిని పూజిస్తారు. ఏదైనా సమస్య ఉంటే స్వామి వారికి మొక్కుకుంటే సమస్య తీరుతుందన్న నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. మొహర్రం పండుగకు జిల్లా నలుమూలల నుంచి స్వామి దర్శనానికి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అంతేకాకుండా మొక్కుబడి ఉన్న భక్తులు బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వేల రూపాయలు విలువ చేసే పూల మాలలను స్వామికి సమర్పిస్తారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఎంతో ఆనందంగా ఈ పండుగను జరుపుకుంటారు.

రామేశ్వర స్వామి ఆలయంలో చోరీ

రాప్తాడు: మండల కేంద్రంలోని రామేశ్వర స్వామి ఆలయంలో రూ.10 వేలు విలువ చేసే గంట చోరికి గురైంది. ఆలయ పూజారి ఈశ్వరయ్య, స్థానికులు కుడాలు చంద్ర, శేషాద్రి, బండి గౌడ్, రమేష్ తదితరులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం మధ్యాహ్నం (2:42) గంటలకు పట్టపగలే ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి వచ్చి స్వామికి మొక్కులు తీర్చుకున్నాడు. ఆ సమయంలో ఆలయంలో ఎవరూ లేకపోవడంతో రూ.10 వేలు విలువ చేసే గంటను చోరీ చేశాడు. సాయంత్రం ఆలయంలోకి వెళ్లిన స్థానికుడు కుడాలు చంద్ర గంట వైపు చూడగా కనింపించ లేదు. ఇదే విషయాన్ని పూజారి ఈశ్వరయ్యను అడగ్గా తనకు తెలియదని చెప్పాడు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్లు నిర్ధారించారు. ఆలయ పూజారితో పాటు స్థానికులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరగనుంది. నగరంలోని వివిధ డివిజన్లలో ఏమైనా సమస్యలుంటే వినతిపత్రాలు అందజేయవచ్చని అధికారులు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశు ఫిర్యాదులను స్వీకరించనున్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

ఆత్మకూరు: డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆత్మకూరు మేజర్ పంచాయతీలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. అనంతనం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని పిలుపునిచ్చారు. మండలంలోని వైఎస్సార్ విగ్రహాలకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రంగులు వేయించారు.

వైఎస్సార్ జయంతికి తరలిరండి

చెన్నేకొత్తపల్లి: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ మైలారపు గోవిందరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం కేక్ కట్ చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అల్లూరి శత వర్ధంతి నిర్వహణ కమిటీ ఏర్పాటు



నినాదాలు చేస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం అర్బన్: స్థానిక కొత్తూరు బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం అల్లూరి శత వర్ధంతి సందర్భంగా సమావేశం నిర్వహించారు. మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతిని సంవత్సరం పాటు నిర్వహించేందుకు కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో 2025, మే 7వ తేదీ వరకు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని విద్యార్థులు, యువతలో విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిటీ కార్యదర్శి డాక్టర్ కె.తబ్రేజ్ ఖాన్ తెలిపారు. అనంతరం కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ఉపాధ్యక్షులుగా తెలుగు అధ్యాపకులు ఎం.సుబ్రమణ్యం, కార్యదర్శిగా డాక్టర్ కె.తబ్రేజ్ ఖాన్, కోశాధికారిగా గణిత అధ్యాపకులు కె.నాగరాజును నియమించారు. అదే విధంగా కార్యవర్గ సభ్యులను నియమించారు.

కురుబలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కురుబ కులస్తులు

ఆత్మకూరు: కురుబ కరులస్తులు అన్ని రంగాల్లో ముందుండి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని మండల కురుబ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూరులోని కనకదాస కల్యాణ మండపంలో విద్యాధార్మిక సంస్థ ఆధ్వర్యంలో పది, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు చదివి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదుతో పాటు డిక్షనరీలు అందజేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం అధ్యక్షుడు సుబ్బర హనుమన్న, ఎంపీపీ హేమలత, నాయకులు నారాయణప్ప, మారెన్న, శివయ్య, రామాంజినేయులు, నీలకంఠ, రాజశేఖర్, బేల్దారి హనుమంతు, పోలన్న, నారాయణ, అక్కులన్న పాల్గొన్నారు.